క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ స్వాతి రెసిడెన్సీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 11కేవీ వీరభద్రనగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీఎం రాకకు కార్గో రోడ్డు ముస్తాబు



మామిడిపల్లి కార్గో రోడ్డులో సున్నం, జాజుతో అలంకరించిన చెట్లు

పహాడీషరీఫ్: సీఎం రేవంత్‌రెడ్డి వివాహ విందుకు హాజరవుతున్న నేపథ్యంలో జల్‌పల్లి–మామిడిపల్లి పి–7 కార్గో రోడ్డు ముస్తాబైంది. మామిడిపల్లి సమీపంలోని పద్మజా ఫామ్ గ్రోవ్స్ రీసార్ట్‌లో ఈ నెల 29న తన సోదరుడి కూతురు వివాహ రిసెప్షన్‌కు సీఎం హాజరవుతున్న నేపథ్యంలో అధికారులు రహదారిలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. కార్గో రోడ్డులో చెత్తా చెదారం లేకుండా ప్రత్యేక డ్రైవ్ చేపట్టడంతో పాటు పద్మజా రిసార్ట్ నుంచి మామిడిపల్లి వరకు కార్గో రోడ్డు మధ్యలో ఉన్న చెట్లకొమ్మలను కత్తిరించి, మొదల్లకు సున్నం, జాజు పూశారు. అదేవిధంగా శ్రీరాంకాలనీ వై జంక్షన్ వద్ద రోజుల తరబడిగా గోతులమయంగా మారిన కార్గో రోడ్డులో నూతనంగా బీటీ వేశారు. సీఎం పర్యటన కారణంగా అయినా కొత్త రోడ్డు వేయడం పట్ల వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణంపై హర్షం



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చొరవతో జల్‌పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, అధికార ప్రతినిధి ఖాజా పాషాలు అన్నారు. వాదే ముస్తఫా బస్తీలోని ప్రధాన రూట్‌లో కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎన్నికలకు ముందు సెప్టెంబర్ మాసంలో ఈ రోడ్డు నిర్మాణ పనులకు అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిధులు రద్దు చేసినప్పటికీ ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించడంతో ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయన్నారు. పార్టీ నాయకులు రహీం, ఇనాయక్, మహ్మద్,ఆజం, హాజీ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు


మహేశ్వరం: మండల కేంద్రంలో ముస్లిం దర్గా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముస్లిం నాయకులు మంగళవారం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని హజరత్ సయ్యద్ కమాల్ షావలీ దర్గా ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆమెను కోరారు. ఈ విషయంపై ఆమె స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎంఏ.సమీర్, దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి షేక్ హాజీబాబా, మహ్మద్ జలాలుద్దీన్, హబీరుద్దీన్, అబ్దుల్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొత్తూరు: ఈ నెల 28వ తేదీ గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

రైతులకు న్యాయం చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్
- ఈ–సిటీ భూ నిర్వాసితులతో సమావేశం



జిన్నాయిగూడలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలో ఈ–సిటీ ఏర్పాటు సందర్భంగా భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ హామీనిచ్చారు. మంగళవారం జిన్నాయిగూడ గ్రామంలో రైతులు, రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు గత ఇరవై ఏళ్ల నుంచి పరిహారం కోసం ఎదురుచూశారన్నారు. గత ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, కేవలం పట్టాలు మాత్రమే ఇచ్చిందన్నారు. ఈ నష్ట పరిహార జాబితాలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని, బీఆర్ఎస్ నేతలు అక్రమంగా పట్టాలు తీసుకొని, నిజమైన రైతులకు అన్యాయం చేశారన్నారు. అలాంటి తప్పులు జరగకుండా ఉండటానికి ఇప్పుడు సర్వే చేయిస్తామన్నారు. ఇందులో 38ఈ పట్టాలు ఉన్న వారికి నష్ట పరిహారం కింద 600 గజాల భూమి, సీలింగ్ పట్టా ఉన్న వారికి 250 గజాలు, కబ్జాకాలంలో ఉన్న వారికి 150 గజాల భూమి నష్ట పరిహారం కింద ఇవ్వడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. వీరికి ఇచ్చే భూమిలో హెచ్ఎండీఏ వెంచర్ లాగానే అనేక మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. రైతులకు రిజిస్ట్రేషన్ చార్జీ లేకుండా మినాయింపు కోసం ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ఇందుకుగాను ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే రిజిస్ట్రేషన్ చేయిస్తామని స్పష్టం చేశారు. రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీఓ అనంతరెడ్డి, మహేశ్వరం తహసీల్దార్ సైదులు, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భోద మాధవరెడ్డి, పాండురంగారెడ్డి, మునుగని రాజు, తోడేటి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

జిన్నాయిగూడలో 38ఈ పట్టా భూమిలో ఉన్న వ్యవసాయ బోర్లు, చెట్లు, ఇతర వస్తువులకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు మాధవరెడ్డి, జంగయ్య, రాజు, భాస్కర్ కోరారు. తమకు భూమితో పాటు, వీటికి కూడా నష్టపరిహారం అందించాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన నాయకులతో మాజీ ఎమ్మెల్యే

మహేశ్వరం: తెలంగాణ ఉద్యమకారులను బీఆర్ఎస్ పార్టీ, మాజీ సీఎం కేసీఆర్ నట్టేట ముంచారని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ విమర్శించారు. మంగళవారం కందుకూరు మండలానికి చెందిన పలువురు ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యావత్ రాష్ట్ర ప్రజలను మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు నమ్మించి మోసం చేశారన్నారు. ఉద్యమకారులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, మేధావులను సైతం కేసీఆర్ నట్టేట ముంచి గద్దెనెక్కారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులను గౌరవించి వారికి న్యాయం చేస్తారన్నారు. గత ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చుతారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో రమేశ్‌చారి, గుడ్లపల్లి రాములు, పద్మ, అమృత, పి.నర్సింహ, భాషాగౌడ్, గడిగ రవి, జంగయ్య పలువురు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని అయ్యప్పస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన జిలెల్ల బాల్‌రెడ్డి దంపతులు మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురుస్వామి గిరిషన్ నాయర్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు దేవాలయ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాత బాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాంరెడ్డి, గురుస్వాములు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం నిర్మాణానికి భూమిపూజ

కొందుర్గు: విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం ఏర్పాటుకు మంగళవారం భూమిపూజ చేశారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల గ్రామంలో గురజాపు వరప్రసాద్ వృద్ధాశ్రమానికి అర ఎకరం స్థలం కేటాయించి ఆయన చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. ఆశ్రమ నిర్మాణానికి పెంటా శ్రీనివాసచారి రూ.1లక్ష విరాళం అందజేశారు. ఆశ్రమ ఆవరణలో ప్రకృతి వనం ఏర్పాటుకు అవసరమైన మొక్కలను అందజేస్తానని కడార్ల వీరబ్రహ్మంగారు ప్రకటించారు. కార్యక్రమంలో విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షుడు నరేంద్రకుమార్, వెస్కో ట్రస్ట్ అధ్యక్షుడు తాతారావు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రక్రియ పూర్తి

- ఎంపీడీఓ బన్సీలాల్



షాద్‌నగర్‌రూరల్: నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్‌రూరల్: ఓటరు జాబితాలో తప్పొప్పులను సవరించి కొత్త ఓటరు జాబితా ప్రక్రియను పూర్తి చేశామని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో వివిధ పార్టీ నాయకులతో ఓటరు జాబితాపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా చేర్పులు, మార్పులపై చర్చించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటరు జాబితాను తయారు చేశామన్నారు. మండల పరిధిలో 47 గ్రామ పంచాయతీలలో గతంలో 48,659 ఓట్లు ఉండగా, కొత్తగా 1,224 నమోదు కావడంతో ప్రస్తుతం మొత్తం 49,883 ఓట్లు ఉన్నాయన్నారు. మరణించిన వారి ఓట్లను తొలగించడంతో పాటు కొత్త ఓటర్లను నమోదు చేశామన్నారు. కొత్త ఓటరు జాబితాను అన్ని జీపీల్లో అందుబాటులో ఉండే విధంగా త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, నార్ల శ్రీనివాస్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

కేశంపేట: మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నూతన ఓటరు జాబితాపై ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో 35,862 మంది ఓటర్లు ఉండగా.. కొత్తగా 660 నమోదయ్యాయని ఎంపీడీఓ వారికి వివరించారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా 221 ఓట్లను తొలగించి, 2,724 ఓటర్ల మార్పులు చేర్పులు చేసినట్టు ఆయన వివరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆంజనేయస్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కోటి దీపోత్సవం ప్రధాన అర్చకుడు రేవల్లిరాజు ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, ప్రశనం పంచగవ్య, ప్రశనం రక్షాబంధనం, కంకణధారణ, రిత్విక్‌వరణం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లిలో కంకరమోనీ శ్రీనివాస్‌ముదిరాజ్ గురుస్వామి 18వసారి మాల ధరించి కేతిరెడ్డిపల్లి నుంచి అయ్యప్పస్వామి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరి తిరిగివచ్చారు. పాదయాత్ర పూర్తి చేసుకొని విచ్చేసిన శ్రీనివాస్‌ముదిరాజ్ గురుస్వామి కేతిరెడ్డిపల్లి గ్రామంలో 18వ మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాన్ని ఉమాశంకర్‌రెడ్డి గురుస్వామి నిర్వహించగా.. కంకరమోనీ క్రిష్టమ్మ, కంకరమోనీ కుమారస్వామి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేతిరెడ్డిపల్లిలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడి పూజలో ముందుగా గణపతి హోమం, కుమారస్వామి పూజ, అయ్యప్పకు పూలు, పండ్లు నూతన వస్త్రాలు సమర్పించి 18 రకాల నూనెలతో అభిషేకం నిర్వహించారు. దీంతో కేతిరెడ్డిపల్లి గ్రామం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఈ పూజా కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్ గురుస్వామి, కంకరమోనీ భానుప్రకాశ్ గురుస్వామి, కంకరమోనీ శంకర్ గురుస్వామి, కంకరమోనీ క్రిష్టమ్మ, కంకరమోనీ కుమారస్వామిలతో పాటు సన్నిధానం స్వాములు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా మంగళవారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జాకారం గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, లాల్ పహాడ్ నుంచి చలివేంద్రంపల్లి వరకు బీటీ పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గాలిగూడ నుంచి నంద్యాతండా బీటీరోడ్డు నిర్మాణానికి రూ.1.40కోట్లు, ముష్టిపల్లి నుంచి దాస్యతండాకు రూ.1.40కోట్లు, గాలిగూడ నుంచి గాంగ్యతండాకు రూ.1.75 కోట్లు, చింతకుంటతండా బీటీరోడ్డు నుంచి వేపకుచ్చతండాకు రూ.70లక్షలు మంజూరుకాగా ఎమ్మెల్యే పనులను ప్రారంభించారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయ భవనం, షాదీఖానా, చౌదరిగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు తరగతి గది నిర్మాణం, మూత్రశాలల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యేను బ్యాండ్ మేళాల మధ్య పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. అనంతరం ఎద్దుల బండిపై ఊరేగింపుగా వెళ్లి ఓ ఫంక్షన్‌హాలులో సమావేశం ఏర్పాటు చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయలేని అభివృద్ధిని ఏడాది కాలంలోనే చేసి చూపెడతామన్నారు. చౌదరిగూడను ప్రత్యేక మండలముగా ప్రకటించిన బీఆర్ఎస్ కనీసం ఒక్క ప్రభుత్వ కార్యాలయానికైనా ప్రభుత్వ భవనం నిర్మించలేకపోయిందన్నారు. అద్దె భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. కనీసం గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారిన పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

డయాబెటీస్‌ను నిర్లక్ష్యం చేయొద్దు

- లయన్స్ క్లబ్ వైద్యాధికారి డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి

మహేశ్వరం: డయాబెటీస్‌ను ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని కందుకూరు లయన్స్ క్లబ్ వైద్యాధికారి డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కందుకూరు మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డయాబెటీస్ టెస్ట్ క్యాంపును ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న జీవన శైలితో వస్తున్న జబ్బులలో ముఖ్యమైనది డయాబెటీస్ అన్నారు. ఇది ఒక మెటబాలిక్ జబ్బు కానీ మహమ్మారిగా మారిందన్నారు. భారతదేశం డయాబెటీస్ రాజధానిగా మారుతుందని, దీనిని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అంతకుముందు 90 మందికి పరీక్షలు చేయగా.. 8 మందికి కొత్తగా డయాబెటీస్ నిర్ధారణ అయిందని తెలిపారు. రక్తపోటు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసి, ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని తగిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో కందుకూరు మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురసాని విఠల్‌రెడ్డి, క్లబ్ కార్యదర్శి తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తా, జిల్లా కేబినెట్ అదనపు కార్యదర్శి తాళ్ల అంజయ్య, మాజీ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, సభ్యులు గుండ్ర సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎగ్గడి సత్తయ్య, తాళ్ల లింగం తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- ఏడీఏ ఆదిలక్ష్మి

కడ్తాల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని వ్యవసాయ శాఖ డివిజన్ అధికారి(ఎడీఏ) ఆదిలక్ష్మి సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడీఏ మాట్లాడుతూ, ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వడంతో పాటు సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని వెల్లడించారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకుని, తేమ శాతం17 లోపు ఉండే విధంగా చూసుకోవాలని, తాలు, మట్టి పెల్లలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు దిగుబడిని తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓలు రమేశ్, అభినవ్, అనూష, వందన, పీఏసీఎస్ ఇన్‌చార్జి జగదీశ్ ఉన్నారు.

అమ్మవారికి కార్తీక సేవలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. కార్తీక మాసం మూడో మంగళవారం కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సురంగల్ రెవెన్యూలో డంప్‌యార్డు ఏర్పాటు చేయొద్దు

మొయినాబాద్: మొయినాబాద్ జీపీకి సంబంధించిన డంపింగ్ యార్డును సురంగల్ రెవెన్యూలో ఏర్పాటు చేయొద్దని గ్రామస్తులు ఎమ్మెల్యే కాలె యాదయ్యకు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. డంపింగ్‌యార్డు ఏర్పాటుకు సురంగల్ రెవెన్యూలోని సర్వే నెంబర్ 135లో స్థలం కేటాయించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని వివరించారు. సురంగల్ రెవెన్యూలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే గ్రామమంతా మురికి కూపంలా మారుతుందని.. సర్వే నెంబర్ 135 ప్రభుత్వ భూమి ఇళ్ల సమీపంలోనే ఉందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సురంగల్ రెవెన్యూలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని కోరారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మాలతీ

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బహుమతులు, ప్రశంసలు పొందడంతో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మాలతీ విద్యార్థులను అభినందిస్తూ సన్మానించారు. మంగళవారం మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామ సమీపంలో గల చేవెళ్ల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అండర్–19 విభాగంలో క్రీడాపోటీల్లో భాగంగా కబడ్డీలో బహుమతుల పొందారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో 68వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు బహుమతి పొందిన సందర్భంగా పాఠశాల ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అన్ని రంగాల్లో పాల్గొని విజ్ఞానవంతులుగా ఎదగాలన్నారు.

బీఎస్పీతోనే సబ్బండవర్గాలకు న్యాయం

- పార్టీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్

కేశంపేట: సబ్బండవర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాలని, అందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో మంగళవారం జన కల్యాణ్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి పుట్టినరోజు సందర్భంగా జన కల్యాణ్ దివాస్‌ను నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా పార్టీకి విరాళాలను సేకరిస్తున్నామన్నారు. దేశంలో ఉన్న పార్టీలకు విరాళాలను కార్పొరేట్ శక్తులు ఇస్తాయని, ఆ పార్టీలు అధికారంలోకి వస్తే కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ప్రభుత్వాలు పని చేస్తాయన్నారు. ప్రజలకు జవాబుదారీగా బీఎస్పీనే ఉందన్నారు. దేశంలో 85శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు భరోసా, భవిష్యత్ బీఎస్పీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షులు అబ్బి జగన్, నర్సింహ, లింగం, అంజనేయులు, శరత్. నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

- పులకరించిన భక్తజనం
- ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తదితరులను ఆహ్వానిస్తున్న పండితులు

మహేశ్వరం: పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మండల పరిధి అమీర్‌పేట్ గ్రామం గుట్టపై కొలువుదీరిన వేంకటేశ్వరుడి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడోరోజు మంగళవారం వేడుకలు భక్తజన సందోహం మధ్య కనుల పండువగా సాగాయి. ఈ సందర్భంగా దేవతామూర్తులకు ఉదయం ఆలయంలో అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పాలంకరణ తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలు, పుస్తె మెట్టెలు, పట్టు వస్త్రాలను ఉత్సవ కమిటీ సభ్యులు.. పుర వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ దంపతులు పట్టు వస్త్రాలు, పుస్తె మెట్టలు సమర్పించారు. సాయంత్రం గ్రామంలో దేవతామూర్తి విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి, పెద్దమ్మతండా మాజీ సర్పంచ్ కాత్రావత్ నీలా మోహన్ నాయక్ దంపతులు అన్నదానం చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

గ్రామంలో వేంకటేశ్వర స్వామి కొలువై ఉండటం సంతోషంగా ఉందని పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఇరువురు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అతిథులను సన్మానించారు. తహసీల్దార్ సైదులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రమేష్, మాజీ ఉప సర్పంచ్ నర్సింగ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహ, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జగదీష్, బుచ్చిబాబు, కోశాధికారి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఆలయ ప్రధాన పూజారి ప్రేమ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.